

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 26

'My Experiment with Truth' అన్న పుస్తకంలో తాను చేసిన తప్పుల గురించి గాంధీ విస్తారంగా ప్రస్తావించారు.

చాలా కొద్దిమంది మాత్రమే తమ ఆత్మకథల్లో ఆ విధంగా వెల్లడించటం జరిగింది. నేను గాంధీ కాలి గోటికి కూడా సరిపోను కానీ, వీలైనంత వరకూ నిజాయితీగా చెప్పాలనేదే నా ఉద్దేశ్యం.

చిన్నప్పుడు కరెంటు వైర్ల మీద సైకిల్ చైను వేసి సినిమాలు చూశాను. అక్కడి నుంచి పెద్దయ్యాక ఎన్నో తప్పులు చేశాను. వ్యాపారంలో ఇలాంటివి తప్పవనుకుంటే అది వేరే సంగతి.

"డబ్బు టు ది పవరాఫ్ డబ్బు" అనే పుస్తకంలో యండమూరి 'న్యాయబద్ధంగా డబ్బు సంపాదించటానికీ, చట్టబద్ధంగా సంపాదించటానికీ' ఉన్న తేడా గురించి వ్రాశాడు.

ఈ ప్రస్తావన ఇక్కడ ఎందుకొచ్చిందంటే "జీవితంలో ధనవంతులైన వాళ్ళు ఎవరైనా నేను ఈ ఆస్తినంతా నీతిబద్ధంగా, చట్టబద్ధంగా సంపాదించాను" అని చెబితే అంతకన్నా అబద్ధం మరొకటి ఉండదు.

ఖర్చులు ఎక్కువ వ్రాసుకొని ఇన్‌కమ్ టాక్స్ తగ్గించటం దగ్గర్నుంచీ, చట్టానికి వ్యతిరేకంగా ఎన్నో రకాల పద్ధతుల ద్వారా పని చేయటం సర్వసాధారణం.

ఈ విధంగా చేస్తేనే జీవితంలో పైకి వస్తారని చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. కానీ చేసింది చెప్పాలి. చేసిన పాపం చెపితే పోతుందన్న సామెతని సమర్ధించటం కాదు గానీ, చెపుతే నిజాయితీకి కాసింత న్యాయం చేకూర్చినట్టు అవుతుంది.

ఇదంతా మీకు మోసం అనిపించవచ్చు. కానీ నేను నిజాయితీగా చెపుతున్నాను. చెప్పే పాఠంలో కానీ, ఇచ్చే సరుకులోగానీ నాణ్యత ఏమాత్రం తగ్గేది కాదు.

రాత్రుళ్ళు కష్టపడి చాలా దీక్షగా సిలబస్ తయారు చేసుకొనేవాడిని. ఈరోజు చెప్పింది మరుసటి రోజు చెప్పకుండా జాగ్రత్త పడేవాడిని. ఇంగ్లీషులో విద్యార్థుల ప్రావీణ్యత రోజురోజుకీ పెరిగేలా చూసుకొనేవాడిని. ఇప్పటికి కూడా ఇవే నా ప్లస్ పాయింట్స్ అని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

ప్రతీ బ్యాచ్‌లోనూ నాకు బాగా తెలిసిన ఒకరిద్దరిని కూర్చోబెట్టేవాడిని.

ఆ గ్రూపుతో వారు కలిసిపోయి, క్లాస్ అయిపోయిన తర్వాత "ఈ రోజు క్లాసు ఎలా జరిగింది?" అని మాట్లాడేవారు.

అలా మాట్లాడేవాళ్ళు నా మనుష్యులని తెల్లియక, విద్యార్థులు నిర్మొహమాటంగా మనసులో మాట చెప్పేవారు. "ఈరోజు సార్ చెప్పింది మాకు అర్థం కాలేదు" అని ఎవరైనా చెపితే, ఆరాత్రి కూర్చుని 'నేనేం తప్పు చెప్పానా?' అని పునః పరిశీలించుకుంటూ ఉండేవాడిని. మరుసటి రోజు అదే క్లాసు మార్పులు చేసి, తిరిగి మళ్ళీ బోధించేవాడిని.

---

మేధ చాలా నీట్‌గా ఉంటుంది. కుర్చీలు స్థాన భ్రంశం చెందవు. బోర్డు పక్కనే డస్టరూ, మార్కర్ పెన్నూ వాటి స్థానాల్లో అవి ఉంటాయి. బోర్డు పైన చిన్న నల్లటి మరక కూడా ఉండదు. చిన్నప్పటి ఒక అనుభవం నాకు ఈ పాఠం నేర్పింది.

నాకు ఏడేళ్ళ వయసున్నప్పుడు మా ఇంట్లో వడ్రంగి పని జరిగింది. సారయ్య అనే వడ్రంగి చెక్క పని చేస్తూ ఉండగా పక్కన బాడిశని కాలితో తన్నాను.

అతడు పని ఆపి లేచి నిలబడి నా చెంప మీద ఎంత బలంగా కొట్టాడంటే ఇప్పటికీ అది గుర్తుంది.

అతడి పరికరాలు అతడికి పూజా సామాగ్రి. అలాగే ప్రతీ వస్తువూ నాకు పూజ్యనీయమైనదే.

ఇదే విషయం మా సంస్థలో చేరే ప్రతీ ఉద్యోగికీ మొదటిరోజే చెపుతాను. మన సంస్థ మీద మనకి గౌరవం లేకపోతే విద్యార్థులకి కూడా ఉండదు అని.

విరామానికి అలవాటుపడితే శరీరం దాన్నే కోరుకుంటుంది. పని చేసే కొద్దీ మరింత ఉత్సాహం వస్తుంది. విశ్రాంతి తీసుకోవాలా? ఉత్సాహంతో పని చేయాలా? అన్న విషయం మనం మన శరీరానికీ, మనసుకీ ఎలా నేర్పితే అవి అలా తయారవుతాయి.

ఏ పని చేయాలన్నా కృషితోపాటూ ఓపిక కూడా ఉండాలి.

పంట నూర్చిన తర్వాత రెండు మూడు నెలలు పని ఏమీ ఉండదు. ఆ సమయంలో ఖాళీగా ఉండక యూరియా సంచుల నుంచి ప్లాస్టిక్ తాళ్ళు విడగొట్టేవాళ్ళం. వాటితో పగ్గాలు తయారు చేసేవాళ్ళం. ఎద్దు ముక్కుకి చిక్కాలూ, అవి పంట తినకుండా నోటికి బుట్టీలు, ఆ తాళ్ళతో తయారు చేసేవాళ్ళం.

అక్కడ రాబడి ముఖ్యం కాదు. ఖాళీగా ఉండటం కన్నా ఏదో ఒక పని చేస్తూ ఉండాలి అనే విషయం ఆ విధంగా అమ్మ నుంచి నేర్చుకున్నాను.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, ఏ కోచింగ్ సెంటర్‌కైనా పరీక్షల ముందు విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఆ సమయంలో నాకు గానీ, మా ఫ్యాకల్టీకి గానీ అంతగా పని ఉండదు. అప్పుడే భవిష్యత్తులో మార్చవలసిన సిలబస్సూ, చేర్చవలసిన కొత్త పాఠాలూ అన్నీ ప్లాన్ చేసుకుంటాం.

దీన్నే 'preparing for the future' అంటారు. ఇది ఎస్కిమోలని చూసి నేర్చుకోవాలి. ఏడాదిలో కొంతకాలం పాటూ వారు బయటకి రావటానికి కూడా వీలుండదు. అందుకని ఆహారం దొరికినప్పుడే దాన్ని భద్రపరుచుకుంటారు. చీమలు కూడా అంతే.

సూదిలో దారం ఎక్కించాలంటే బొటన వేలూ చూపుడు వేలితో దారం కొసలు పట్టుకుని చివర్లన్నీ కలిపి, నలిపి సూటిగా తయారు చేసి సూదిలోకి ఎక్కిస్తాం. ఏకాగ్రత కూడా అంతే. మనసు పరిపరి విధాలా పోతూ ఉంటుంది. అలా పోకుండా పట్టుదల అనే బొటన వేలితో, ఏకాగ్రత అనే చూపుడు వేలితో మనసుని నొక్కి పట్టుకుంటే అది జీవితం అనే సూది కన్నంలోంచి ధ్యేయం వైపు సాగిపోతుంది. పోలిక మరీ దరిద్రంగా ఉన్నదా? అయితే దీన్ని ఇక్కడ వదిలేసి మన సబ్జెక్టులోకి వెళదాం.

---

క్రమక్రమంగా నా ఆర్థిక స్థితి బాగుపడసాగింది. ఒక బైక్ కొన్నాను. ఆ బైకు ఇప్పటికీ నా దగ్గర ఉంది. దాని మీదే దసరాకి వైజాగ్ నుంచి వరంగల్ వెళ్ళాను. నా దగ్గర వారందరికీ బట్టలు కొన్నాను.

క్రితం సంవత్సరం దసరా రోజున ఆర్.టి.సి. బస్‌స్టాండ్‌లో బల్ల మీద ఒంటరిగా దుఃఖించటం గుర్తుంది. ఈ దసరా అద్భుతంగా అందరితో కలిసి ఆనందంగా గడిపాను. అప్పటికి అమ్మను చూసి రెండు సంవత్సరాలు అయింది.

"ఇన్నాళ్ళూ ఏం చేసావురా బిడ్డా?" అని అడిగింది. "జీవితాన్ని నేర్చుకున్నాను అమ్మా" అని క్లుప్తంగా చెప్పాను. ఆమెకు అర్థమయిందో లేదో తెలీదు కానీ కన్నీళ్ళతో నవ్వింది. మనసునిండా సంతృప్తితో తిరిగి వైజాగ్ వచ్చాను.

ఎనిమిది నెలలూ అయిపోయాయి. బిల్డింగ్ ఖాళీ చేయాలి. పాలిటెక్నిక్ బ్యాచ్ తయారవుతోంది.

కొత్తగా మరో ఇల్లు తీసుకోవాలంటే అంత డబ్బు లేదు. చిన్న ఇల్లు తీసుకున్నాను. కానీ నెలరోజుల్లో అది నాకు సరిపోదని అర్థమయింది. స్టూడెంట్స్ బాగా పెరిగారు. ఇంకో ఇల్లు తీసుకున్నాను. వరంగల్ నుంచి వచ్చిన స్నేహితులందరూ ఆ ఇంట్లో నాతో పాటే ఉండేవారు. అక్కడే క్లాసులు చెప్పాను. అంతా బాగానే ఉంది కానీ మెయిన్ రోడ్డులో బోర్డు లేదు.

ఈ లోపు నా పోటీదార్లు కూడా పెరిగారు. వాళ్ళతో నాకు వచ్చిన చిక్కేమిటంటే నేనేం చేస్తే వాళ్ళూ అదే చేసేవారు. నేను ఉచితంగా పాఠాలు చెపుతున్నాననగానే వాళ్ళూ అదే పద్ధతి మొదలుపెట్టారని ఇంతకు ముందే వ్రాశాను.

అప్పుడు ఇంకొక కొత్త ప్రకటన ఇచ్చాను.




చాలా రిస్క్‌తో కూడిన ప్రకటన ఇది.

కొత్తగా చేరబోయేవారు "మాకు ఇంగ్లీషు వచ్చిందో లేదో మీకెలా తెలుసు?" అని ప్రశ్నించేవారు

"ఇది విలువలకు సంబంధించినది. మీరు మూడు నెలల తర్వాత నిజంగా 'ఇంగ్లీషు రాలేదు' అని భావించినట్లయితే, మీరు చెల్లించిన ఫీజంతా తిరిగి ఇచ్చేయటానికి నాకు ఏమీ అభ్యంతరం లేదు" అని చెప్పేవాడిని.

నన్ను ఏడిపించటానికి కొంతమంది విద్యార్థులు చేరినా, మూడు నెలలలో వాళ్ళు కూడా మారిపోయేవారు.

ఈ పోటీదారులు నన్ను వదిలిపెట్టలేదు.

వాళ్ళు కూడా వైజాగ్ అంతా 'ఇంగ్లీష్ రాకపోతే ఫీజు వాపస్ ' అని పోస్టర్లు వేశారు. తిరిగి సమస్య మొదటికొచ్చింది.

అప్పుడు మరొక ప్రకటన ఇచ్చాను. చాలా రిస్కుతో కూడిన వ్యవహారమిది. నాకొక క్రిమినల్ లాయర్ పరిచయమయ్యాడు. ఆయన దగ్గర సలహా తీసుకొని బాండ్ పేపర్ల మీద ఎగ్రిమెంట్లు టైప్ చేయించాను.

మరుసటి రోజు పెద్ద ప్రకటన వెలువడింది.



మేధా స్పోకెన్ ఇంగ్లిష్

**మూడు నెలల్లో ఇంగ్లిష్ రాకపోతే**

# అయిదు వేలు బహుమతి

అయిదొందలు ఫీజు కట్టి, ఇంగ్లీషు రాకపోతే అయిదువేలు వస్తుందని తెలిసేసరికి విద్యార్థులు క్యూ కట్టారు. కొంతమంది అయిదువేల కోసం చేరిన వారున్నారు. నాకున్న నమ్మకం ఏమిటంటే నా దగ్గర మూడు నెలలు ఉన్నవాడు ఇంగ్లీషు మాట్లాడకుండా వెళ్ళలేడు' అని.

తర్వాతి బ్యాచ్ స్టార్ట్ అయింది. మూడు నెలల పాటూ వారికి చెప్పాను. కొంతమంది విద్యార్థులు సమస్యాత్మకంగా ఉండేవారు. వారిని ఆత్మీయంగా కట్టి పడేశాను. బ్యాచ్ అయిపోయిన తర్వాత ఒక్క విద్యార్థి కూడా అయిదు వేలు క్లయిమ్ చేయలేదు.

వేరే సంస్థలవారు అంత రిస్కు తీసుకోవటానికి సాహసించ లేదు. ఎందుకంటే వాళ్ళ సంస్థలో యజమాని వేరు. చెప్పేవాళ్ళు వేరు. నా సంస్థలో నేనే యజమాని. నేనే టీచరు. ఇది నాకు చాలా లాభసాటిగా పరిణమించింది.

దీంతో నాకు మరో ఆలోచన వచ్చింది.

**ప్రత్యర్థిని బలంగా కొట్టటమే వ్యాపార లక్షణం.**

పోస్టర్ల మీద నా ఫొటో వేయటం ప్రారంభించాను. ఊరంతా ఫోటో కనపడితే, చూసేవారి మనసులో ఒక ముద్ర పడుతుంది. వాళ్ళు క్లాస్‌లో చేరినప్పుడు అదే వ్యక్తిని స్టేజి పై చూసేసరికి, ఒక పాపులర్ వ్యక్తీ మనకి పాఠం చెపుతున్నడన్నా అత్మీయతాభావం కలుగుతుంది. తెర మీద తరచూ కనపడే పాపులర్ నటుడికీ, కొత్త నటుడికీ తేడా మనకి తెలిసినదే కదా.

నా ప్రత్యర్థులెవరూ ఆ సాహసం చేయలేదు. ఎందుకంటే ముందే చెప్పినట్టూ, అక్కడ సంస్థలో 'చెప్పేవారు' వేరు, 'యజమానులు' వేరు.

ఆ చెప్పే టీచరు ఎంతకాలం ఉంటాడో వాళ్ళకు తెలీదు. వీళ్ళు ఆ విధంగా ఫొటో ప్రకటనలిస్తూ పోతే కొంతకాలానికి గుడ్‌విల్ పెరిగి ఆ టీచరు, సంస్థను వదిలేసి తనే కొత్తగా పెట్టుకునే ప్రమాదం ఉంది. ఇది ఊపిరి తిరక్కుండా ప్రత్యర్థిని కొట్టిన దెబ్బ.

(ఈ రోజు కూడా హైదరాబాదులో పోస్టర్ల మీద కోచింగ్ సెంటర్ 'టీచర్' ఫొటో కొనసాగటానికి కారణం ఆ రోజు ఆలోచనే అని గర్వంగా చెప్పుకోగలను).

అయితే నా ఆలోచనని తిరిగి దెబ్బకొట్టటానికి పోటీ సంస్థలు ఇంటర్నెట్ నుంచి అందమైన అమ్మాయిల ఫొటోలు తీసి పోస్టర్లు వేయటం ప్రారంభించారు.

ముక్కులో వేలు పెడితే గాడిద డొక్కలో తన్నిందని తెలంగాణలో ఒక సామెత ఉంది. వాళ్ళ అలోచన ఎదురు తిరిగి నెగెటివ్‌గా పని చేయటం ప్రారంభించింది. పోస్టర్ మీద అమ్మాయిల ఫొటోలు చూసి ముచ్చటపడి వెళ్ళిన విద్యార్థులు, అక్కడ చెప్పే టీచర్లు వేరే రకంగా ఉండటంతో చాలా నిరాశ చెందేవారు.

ఈ విధంగా పరిస్థితులు క్రమక్రమంగా సర్దుకుంటున్న సమయంలో ఊహించని కోణంలో ఒక ప్రమాదం వచ్చింది.

ఒకరోజు క్లాస్ చెప్తూ ఉండగా ఒక రౌడీ వచ్చాడు. రావటం రావటమే లోపలకు వచ్చి "ఏరా! నువ్వేనా చిరంజీవివి? ఒక సారి బయటకు రారా" అన్నాడు. క్లాసంతా ఒక్కసారిగా స్థబ్దమై పోయింది.

చూడటానికి చాలా రఫ్‌గా ఉన్నాడు. అతడిని ఎవరు పంపారో, ఎందుకు పంపారో తెలియలేదు. ఎక్కడా చూసిన గుర్తు కూడా లేదు. ఒక బూతు మాట ఉపయోగిస్తూ నన్ను బయటకు రమ్మన్నాడు. నాకు భయం వేసింది. భయంకన్నా ముఖ్యంగా విద్యార్థులందరి ముందూ అతనితో గొడవ పెట్టుకుంటే రేపు పేపర్లలో అది వస్తే నా సంస్థకి పెద్ద దెబ్బ.

నిశ్శబ్దంగా అతడితో కలిసి బయటకి వెళ్ళాను.

"నీకేం ఇంగ్లీష్ వచ్చని వీళ్ళకి చెప్తున్నావ్‌రా?" అంటూ మళ్ళీ ఇంకో బూతుమాట ఉపయోగించాడు. కొన్నేళ్ళ క్రితం వరంగల్‌లో ఇదే మాట అని ఉంటే దాని పరిణామం ఇంకోలా ఉండేది.

"నువ్వెవరు? అసలు నీకేం కావాలి?" అన్నాను.

"విశాఖపట్నంలో ఎవర్నడిగినా చెప్తారు. కావాలంటే ఎంక్వయిరీ చేసుకో. నాకు మాత్రం రేపటి నుంచీ ఈ స్కూలు ముందు నీ బోర్డు కనపడకూడదు".

"కనపడితే?"

"ఆ తరువాత ఇంకెవరికీ కనపడవ్" అనేసి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. 'అనవసరంగా రౌడీ అయ్యాడు కానీ, సినిమా రైటర్ అయ్యుంటే కోట్లు సంపాదించేవాడు' అనుకున్నాను.

నా మిత్రులందరూ "అటో ఇటో తేల్చుకుందాం. వాడి అంతు చూద్దాం" అన్నారు.

కానీ అతను ఎవరో, అతని వెనుక ఏ చరిత్ర ఉందో నాకు తెలీదు.

అతని గురించి ఆ సాయంత్రం ఎంక్వయిరీ చేశాను. పెద్ద రౌడీ షీటరనీ, కంచరపాలంలో ఉంటాడనీ, అతని మీద ఎన్నో మర్డరు కేసులు ఉన్నాయనీ తెలిసింది.

కొంచెం సేపు ఆలోచించాక ఒక నిర్ణయం తీసుకున్నాను.

బైకు మీద కంచరపాలెం వెళ్ళాను.

అతడి గురించి అడిగితే, దూరంగా ఉన్న ఒక పాక చూపించారు. అతడు బయటకు రావటం, నేను పిడికిలి బిగించి, బలంగా అతడి మొహం మీద కొట్టేసరికి అతడు వెళ్ళి దుమ్ములో పడటం, నాలుగు వైపుల్నించీ అతడి అనుచరులు చుట్టుముట్టగా నేను గాలిలో స్కై జంప్ చేసి... ఇవేమి జరగలేదు.

నేనే లోపలకు వెళ్ళాను. లోపల అతని తల్లి వంట చేసుకుంటోంది. వెళ్ళి కూర్చున్నాను. కొంచెం సంభాషణ జరిగాక ఆవిడకు చెప్పాను "చూడమ్మా. నీ కొడుకు నా దగ్గరకు ఎందుకు వచ్చిండో తెలీదు. నేనెక్కడో వరంగల్ నుంచీ పొట్ట చేతబట్టుకుని వచ్చినోడ్ని. కాస్త చదువుకున్నాను. కొంచెం డబ్బులు సంపాదించుకుందాం అనుకుంటున్నాను".

నేను చెప్తున్నది ఆమెకు అర్థం కాలేదనుకుంటా. తన పని తాను చేసుకుంటోంది. ఆమె బయటకు వెళ్ళి బోరింగ్ కొట్టి నీళ్ళు తెచ్చుకుంటూంటే కూడా వెళ్ళి బకెట్ లోపలికి తీసుకొచ్చి సహాయం చేశాను.

దాంతో ఆమెకు కాస్త మంచి అభిప్రాయం కలిగి, "ఏం కావాలి?" అని అడిగింది. చెప్పిందే మళ్ళీ చెప్పాను.

"ఆడికి సానామందితో గొడవలుంటాయి. అయ్యన్నీ నాను పట్టించుకోను" అంది.

"నాకూ నీ కొడుక్కీ ఏ సంబంధం లేదు".

“నానేటి సేయ్యాలి?”

“కనపడితే ప్రాణాలు తీస్తాడు. నీ కొడుకొచ్చేవరకూ ఇక్కడే కూర్చుంటాను ఇక్కణ్ణుంచి బయటకు వెళ్ళను. ఈ పాకలోనే నా ప్రాణాలు పోవాలి" అన్నాను.

ఏమి చెయ్యాలో తోచనట్టూ ఆమె ఆలోచనలో పడింది.

వంటలో అమెకు సాయం చేయటం ప్రారంభించాను. వంట బాగా వచ్చు కాబట్టి రెండు నిమిషాల తరువాత ఆమెని పక్కకి జరిపి నేనే చేప కూర కొత్తరకంగా చేసాను.

“ఇవన్నీ ఎక్కడ నేర్చుకున్నావ్” అని అడిగింది.

"మా అమ్మ పొద్దున్నే పొలానికి పోతే నేనే ఇంట్లో వంట. నేను కూడా నీ కొడుకులానే తండ్రి లేని కుర్రాడిని. మా అమ్మ అంటే నాకు చాలా ఇష్టం" అన్నాను.

ఆ మాటలకి ఆమె నాకు పుర్తిగా దగ్గరయింది. ఈలోపు అతడు పాకలోకి వచ్చాడు. చేతిలో క్వార్టర్ బాటిల్ ఉంది.

మంచం మీద కూర్చుని వాళ్ళ అమ్మతో కబుర్లు చెప్తున్న నన్ను చూసి షాక్ తిన్నాడు. బయట తాగినదంతా దిగిపోయినట్టుంది. కళ్ళు నులుముకుని మళ్ళీ చూసాడు.

నేను స్నేహపూర్వకంగా నవ్వాను.

“వీడు ఇక్కడకెందుకొచ్చాడు?” అని అరిచాడు.

అప్పుడు మొదలుపెట్టింది వాడిని తిట్టటం. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. "పంతులు దగ్గరకి ఎలిపోచ్చిసినావంట గదరా ముతరాసి నా కొడకా. యాడనుంచో ఈ ఊరి ఎల్లిపోసోచ్చి పాతాలు సెప్పుకుంటూంటే నీకేందిరా పోయే కాలం ఎండు బెద్ద మీద ఎర్రకాణీలు ఏరుకునే ఎదవా" అని మొదలు పెట్టింది. అంత పెద్ద రౌడీ కూడా తల్లిని ఏమీ అనలేదు కాబట్టి తలవంచుకొని నిలబడ్డాడు.

మా ఇద్దరినీ కూర్చోబెట్టి భోజనం పెట్టింది. ఈ కుర్రాడే వండాడని చెప్పి చేపల పులుసు వడ్డించింది. ఈలోపు నేను వెళ్ళి ఇంకో క్వార్టర్ బాటిల్ తెచ్చాను. ఇద్దరం మందు కొడుతూ స్నేహితులమైపోయాం.

క్వార్టర్ బాటిల్ అయిపోయాక అతను లేచి నిలబడి "అన్నా! ఈరోజు నుంచీ మనం స్నేహితులం. ఇంకెవరైనా వచ్చి బెదిరిస్తే నా పేరు చెప్పు చాలు. నీ వెనుక నేనున్నానని తెలిస్తే నీ మీద ఈగ వాలదు" అన్నాడు.

---

ఒక రౌడీ నుంచి తప్పించుకోగలిగాను కానీ నా ప్రత్యర్థులు ఇక్కడితో ఆగరని తెలుసు. ఆ సమయంలో నా దగ్గర ఒకతను ఇంగ్లీష్ నేర్చుకోవటానికి చేరాడు. అతని పేరు రామ్. ఆయన ఒక పోలీస్ అధికారి. అప్పటికే అతనికి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అన్న పేరు ఉంది.

ఆయనతో స్నేహం పెరిగింది. ఆయన ఒక్కడికే స్పెషల్‌గా క్లాసులు చెప్పేవాడిని. ఇంగ్లీషు క్లాసుల్లో కాదు. సంభాషణల్లోనే అది బాగా డవలప్ అవుతుందని ఒప్పించాను.

ఇద్దరం కలిసి ఊరంతా తిరిగేవారం. పట్టణమంతా ఆయన కంట్రోల్‌లో ఉండేది. ఆయన వెనుక బైకు మీద కూర్చుని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినప్పుడు అందరూ ఆయనకి సెల్యూట్ చేసేవారు. అందరికీ ఆయన నన్ను "మా సారు" అని పరిచయం చేసేవారు. ఇలా ఒక నెల అయ్యేసరికి విశాఖపట్నంలో ఉండే దాదాపు ప్రతీ పోలీసు స్టేషన్లోని అధికారులందరూ పరిచయమయిపోయారు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)